# తీరని రుణం.. రైతన్న రణం

• మంచిర్యాల జిల్లా నెన్నెలలో రోడ్డెక్కిన రైతులు



మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో 2 లక్షల రుణమాఫీ కాలేదంటూ రైతులు రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని సీఎం వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు సింగతి రాంచందర్, రైతులు డిమాండ్ చేశారు. – నెన్నెల

• బాల్కొండ నియోజకవర్గం వేల్పూరు ఎక్స్‌రోడ్డులో..



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. – వేల్పూర్

"మా రుణం ఎందుకు మాఫీ కాలే.. మాటిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చేయలే.. ఇదే సర్కారు.. ఏమి గోస ఇది.. అందరికీ చేసినన్నడు.. అన్నీ చేసినట్టు చెప్పకున్నరు.. మాకెందుకు గాలే" అని రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అన్నదాతలు శనివారం రోడ్డెక్కారు. వ్యవసాయ రుణాలు తీసుకున్న బ్యాంకుల ఎదుట ఆందోళనలకు దిగారు. ఒక్కో బ్యాంకు పరిధిలో వందలాది మంది రైతుల రుణాలు మాఫీ కాలేదు. కోట్ల రూపాయల రుణాలు మాఫీ కాలేదు. దీంతో సర్కారు నిర్లక్ష్యాన్ని రైతులు ఎండగట్టారు. పాలకుల పరిహాసాన్ని నిరసించారు. బ్యాంకుల అధికారుల అలసత్వంపై ధ్వజమెత్తారు. మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలంటూ కొర్రీలు పెట్టిన ప్రభుత్వ వైనాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వెంటనే మాఫీ చేయాలని, లేకుంటే ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు.

• నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో..



బ్యాంకు ఖాతా పేరుకు, ఆధార్ కార్డుకు మిస్‌మ్యాచ్ కావడంతో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు రుణమాఫీ ఆగిపోయింది. దీంతో శనివారం మండలకేంద్రంలోని ఇండియన్ బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. – నార్కట్‌పల్లి

## ఎందుకు రుణమాఫీ కాలేదో!



నేను కవేలి బ్యాంకులో రూ.1.35 అప్పు తీసుకున్నాను. రూ.2 లక్షల వరకు రుణమాఫీ అయ్యిందంటే నేను కూడా బ్యాంకుకు వచ్చాను. కానీ, వారు అతికించిన లిస్టులో నా పేరు లేదు. నాకు రుణమాఫీ ఎందుకు కాలేదో తెలియడం లేదు. ఎవరూ చెప్పడం లేదు. ఇప్పుడు నేనేం చేయాలి?

-సంగయ్య, రైతు, కవేలి గ్రామం,
కోహీర్ మండలం(సంగారెడ్డి జిల్లా)

• వనపర్తి జిల్లా అమరచింతలో..



రుణమాఫీ కాలేదంటూ వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఎదుట రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు శనివారం ఆందోళనకు దిగారు. అధికారంలోకి రాగానే షరతులు పెట్టి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. – అమరచింత

## శాతగాని మాటలు ఎందుకు చెప్పాలె?



ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చినప్పుడు అందరి ఓట్లు కావాలి కానీ, రుణమాఫీ చేసేటప్పుడు రైతులందరికీ చేయాలనే సోయి లేని ప్రభుత్వం ఇది. శాతగాని మాటలు చెప్పి రైతులను ఆగం చేసుడెందుకు? గతంలో రూ.25 వేల చొప్పున రూ.లక్ష వరకు రుణమాఫీ అయినప్పుడు ఇప్పుడెందుకు కాదు? ఊర్లో 10 మందికి రుణమాఫీ అయితే మిగతా వాళ్లు ఎటు పోతరు? ఆ పది మందితోనే ప్రభుత్వానికి అవసరమా? ఊర్లకు వచ్చి వ్యవసాయం చేసేటోళ్లు ఎవలు? చేయనోళ్లు ఎవలు అని చూసి అందరికీ మాఫీ చేయాలె. వ్యవసాయం కోసం బ్యాంకుల్లో రుణాలు, బయట వడ్డీలకు తెచ్చుకొని రెక్కలు పోయేదాక వ్యవసాయం చేసిన చేతికి రూపాయి వత్తలేదాయె. రైతు అనేటోళ్లందరికి మాఫీ చేయాలె.

- ఎల్లావుల విజయ, పంచోత్కులపల్లి,
ములుగు మండలం, ములుగు జిల్లా

• నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్‌రోడ్‌లో..




రైతు రుణమాఫీ కోసం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్‌రోడ్ వద్ద శనివారం నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వినూత్న నిరసన తెలిపారు. తెలంగాణలోని పలు ఆధ్యాత్మిక క్షేత్రాలకు సంబంధించిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఆయా దేవుళ్లపై ఒట్లు వేసుకుంటూ రైతులను నమ్మించి రుణమాఫీ చేస్తానని అబద్ధపు హామీలు ఇచ్చాడని వేముల గుర్తుచేశారు. – వేల్పూర్

## ఒక్కరికీ మాఫీ కాలేదు



మా ఊర్లో పావులా వంతు రైతులకూ రుణమాఫీ జరగలేదు. నాకు ఏడెకరాల భూమి ఉంది. నా పేరు మీద రూ.1,95 లక్షలు, నా భార్య పేరు మీద రూ. 2.12 లక్షలు ఉంది. ఏఈవోను అడిగితే ఒకటే రేషన్‌కార్డు మీద ఇద్దరి పేర్లు ఉన్నందున పథకం వర్తించలేదని చెప్పారు. బ్యాంకు అధికారులను అడిగితే రేషన్‌కార్డు నిబంధన ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం అని అంటున్నారు. ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వస్తాయని, తొందరపడొద్దని సముదాయిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.లక్ష రుణమాఫీ పొందాను. ఇప్పుడూ అలాగే రుణమాఫీ వర్తింపజేస్తే నాలాంటి ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుంది.

- బిక్కినేని మల్‌హాల్‌రావు,
పంచోత్కులపల్లి, ములుగు మండలం, ములుగు జిల్లా

• సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో..



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవేలిలోని బ్యాంకు వద్ద శనివారం రుణ మాఫీ జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న రైతులు. పేర్లు లేని వారు నిరాశతో వెనుదిరిగారు. –కోహీర్

• కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డిలో..



రుణమాఫీ కాలేదని కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు పెద్దమల్లారెడ్డిలోని రైతువేదికలో ఆందోళన చేపట్టారు. అనంతరం మూకుమ్మడిగా కామారెడ్డిలోని కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. – కామారెడ్డి

## వచ్చినోళ్లు నవ్వబట్టె.. రానోళ్లు ఏడ్వబట్టె



రుణమాఫీ అయితదని ఎదురు చూసినం. మాకు కాలె. మా ఆయన సదర్‌లాల్ పేరు మీద రూ.2.02 లక్షల అప్పు ఉన్నది. ఇప్పుడు మాఫీ కాలేదు. పైన రూ.2 వేలు కట్టినా కాదంటున్నరు. రుణమాఫీ వచ్చినోళ్లు నవ్వబట్టె.. రానోళ్లు ఏడ్వబట్టె.. ఎందుకు ఈ దొంగ రాజకీయాలు. పెట్టుబడికే కదా రైతులు అప్పులు తెచ్చేది. దానికి ఇన్ని తాకట్లా. పెట్టుబడికి కొంచెం తోడు అయినట్టు ఉంటదనుకుంటే నాశనం అయిపాయె. రైతలందరికీ కచ్చితంగా రుణమాఫీ చేయాలె.

- భూక్యా యశోద, పంచోత్కులపల్లి,
ములుగు మండలం, ములుగు జిల్లా

• నిజామాబాద్ జిల్లా జన్నేపల్లిలో..




నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం జన్నేపల్లిలోనూ సిండికేట్(కెనరా) బ్యాంకు వద్ద రైతులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతన్నలందరికీ రుణమాఫీ చేయాలంటూ డిమాండ్ చేశారు. – నవీపేట

• మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో..




పంట రుణం తీసుకున్న రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వివిధ గ్రామాలకు చెందిన రైతులు ధర్నా చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు రైతు వేదికలో వ్యవసాధికారులు, ఏఈవోలు లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. – నర్సింహులపేట

• జగిత్యాల జిల్లాలో..



రుణ మాఫీ కాలేదంటూ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట, చింతలపేట, మల్లాపూర్ మండలంలోని సాతారం, ధర్మారం, చిట్టాపూర్ గ్రామాల పరిధిలోని రైతులు శనివారం మల్లాపూర్ రైతువేదికలో డీఏవో వాణి, బ్యాంకు అధికారులను నిలదీశారు. – కరీంనగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి

• తాంసిలో ఏవో నిలదీత



రుణమాఫీ విషయంలో ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్లలో రైతులు వ్యవసాయ అధికారి శివకుమార్‌ను నిలదీశారు. ఎందుకు రుణమాఫీ చేయలేదంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. – ఆదిలాబాద్

• భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలువురు రైతులు శనివారం రుణమాఫీ అంశంపై ఏవో కార్యాలయ సిబ్బందిని నిలదీశారు. నిరసనగా కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు, సిబ్బందిపై చర్య తీసుకోవాలని కోరారు. – మహదేవపూర్

## నాకు రుణమాఫీ ఎప్పుడు చేస్తరు?



నేను కవేలి బ్యాంకులో రూ.లక్షన్నర అప్పు తీసుకున్నాను. ఇప్పుడు అవి రూ.1.60 లక్షలు అయ్యాయి. రుణమాఫీ అయ్యిందని బ్యాంకుకు వస్తే అందులో నా పేరు లేదు. ఇప్పుడు కాకపోతే రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తరు? నాకు ఎందుకు కాలేదో ఎవరూ కరెక్టుగా చెప్పడం లేదు. బ్యాంకు వాళ్లు, వ్యవసాయ అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదు.

- లక్ష్మణ్, రైతు, పైడిగుమ్మల్ తండా,
కోహీర్ మండలం (సంగారెడ్డి జిల్లా)

# జీతాలు పుణ్యానికే వస్తున్నాయా?

• బ్యాంకర్లపై ఎమ్మెల్యే యెన్నం చిర్రుబుర్రు
• మంత్రి సమక్షంలోనే ఫైల్స్ పడేసిన శ్రీనివాస్‌రెడ్డి



మహబూబ్‌నగర్ డీసీసీబీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 17: డీసీసీబీ అధికారులపై మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చిర్రుబుర్రులాడారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి జిల్లా బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి ముఖ్యఅతిథిగా హాజరవగా.. ఎమ్మెల్యేలు యెన్నం, మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొరమోని వెంకటయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ.. 'మీ అందరికీ జీతాలు టైంకు ఇస్తుంటే.. మీకు ఉన్న పని ఏందీ? నిమ్మలంగా ఏసీలలో కూర్చొనే కదా పనిచేసేది? మీ కంప్యూటర్లలో ఉన్న లిస్టుల్లో ఏం తప్పు ఉందో చూడలేరా? ఇన్ని ఏండ్ల నుంచి జీతాలు ఎందుకు తీసుకుంటున్నారు? జీతాలు పుణ్యానికే వస్తున్నాయా? ఇదేనా మీ బాధ్యత? మీ రికార్డ్స్ సరిగా లేవు. మంత్రి వస్తున్నప్పుడు రికార్డ్స్ సరిగ్గా పెట్టుకోవాలన్న ఇంగిత జ్ఞానం కూడా లేదా మీకు? నిర్లక్ష్యంగా.. బాధ్యత లేకుండా.. మాకేం సంబంధం లేదన్నట్టు పనిచేస్తున్నారు' అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలోనే డీసీసీబీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ముందే ఆవేశంతో రుణమాఫీ ఫైల్స్‌ను పడేశారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని, లేకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని బ్యాంకర్లకు సూచించారు.